# పడవ మునక

యూనివర్సిటీ వరండాలు కోలాహలంగా ఉన్నాయి. ఆరోజే పరీక్షా ఫలితాలు తెలిశాయి. పాసయినవారు ఆనందంగా అటూ ఇటూ తిరుగుతూ అందర్నీ పలుకరిస్తున్నారు. పరీక్ష తప్పినవారు ఎవరికీ కనపడకుండా ఇంటికి వెళ్లేప్రయత్నంలో ఉన్నారు. అప్పుడే ప్రొఫెసర్‌గారి గదిలోకి ఐదుగురు కలిసి అడుగుపెట్టారు. ఆయన మొహంలోకి చిరునవ్వు వచ్చింది. కోర్సులో చేరిననాటినుంచి ఐదుగురూ ఒకటిగా ఉన్నారు. ఐదుగురూ పాసయ్యారు. ఎవరి పరీక్ష పోయినా మిగిలిన నలుగురూ వాళ్లు పరీక్ష పాసయినా సంతోషం పొందగలిగే వారు కాదు. ఆయన అయిదుగురినీ పలుకరించారు.

"కంగ్రాటులేషన్స్ అందరికీ-స్వామీ, రాజా, చందర్, విజయ్, రఘూ, మై హార్టీ కంగ్రాటులేషన్స్. కష్టపడిచదివేరు. చక్కగా పాసయ్యారు. ముఖ్యంగా స్వామీ నువ్వు నా స్టూడెంట్ అయినందుకు నాకెంతో గర్వంగా ఉందోయ్. యూనివర్సిటీ ఫస్ట్ రావడమే కాదు. ఇదివరకటి యూనివర్సిటీ రికార్డులన్నీ బద్ధలు కొట్టేవు. చాలా సంతోషంగా ఉంది. ఊ చెప్పండి. ఏమిటి భవిష్యత్ ప్రణాళిక?"

"ఏముంది సార్ ఉద్యోగ ప్రయత్నమే" ఐదుగురూ కోరస్‌గా అన్నారు.

"మంచిది. విష్‌యూ ఆల్‌దబెస్ట్ మీ వల్ల దేశానికి ఎంతో మేలు జరగాలని ఆశిస్తున్నాను. మా తరం పని అయిపోయింది. ఇంక దేశభవిష్యత్తు మీ చేతిలో ఉంది. దేశ ప్రగతి అనే ఓడకు మీరంతా నావికులు. స్వామీ ముఖ్యంగా నువ్వు ఓడ కెప్టెన్ వంటివాడివి, వెళ్లిరండి. బెస్ట్ ఆఫ్ లక్"

ఆ అయిదుగురి ముఖాలలో ఎంతో పట్టుదల, ఉత్సాహం కన్పిస్తున్నాయి. ఏదో సాధించాలన్న తపన ఐదుగురిలోనూ ఉంది. త్వరలో కలుసుకుందామనుకుంటూ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లేరు.

స్వామి తల్లిదండ్రులెంతో సంతోషించారు. "మంచిదిరా అబ్బాయ్ ఉన్న రెండెకరాలూ అమ్మి నిన్ను పట్నంలో ఉంచి చదివిస్తున్నానంటే అందరూ నన్ను ఎద్దేవా చేశారు. ఈనాడు నువ్వు అందరిలో మొదటిగా పాసయ్యేవు. తప్పకుండా మంచి ఉద్యోగం వస్తుంది. హాయిగా ఉంటావు. చదివించక రెండెకరాలే నీకిచ్చాననుకో ఏం వస్తుంది దానిమీద?"

"నాకు ఉద్యోగం వచ్చాక మీరు నా దగ్గరే ఉండాలి నాన్నా"

"మాదేముందిరా పండుటాకులం నీభవిష్యత్తూ, ఆనందమూ మాకు ముఖ్యం ఇదిగో ఈ డబ్బుంచు. పొలమమ్మిన దాంట్లో నీ చదువుకు పోగా మిగిలింది. ఉద్యోగం వచ్చేదాకా ఖర్చులకి వుంటుంది".

❖ ❖ ❖

మిత్రులయిదుగురు ఒకగది తీసుకొని ఉద్యోగప్రయత్నాలు ప్రారంభించారు. పగలు ఇంటర్వ్యూలకి వెళ్లడం, సాయంత్రాలు అప్లికేషన్లు రాయడం, రాత్రిళ్ల అర్థమైన ప్రశ్నలకి ఆన్సర్లు నేర్చుకోవడంతో అయిపోయేది. టి.వి. వార్తల్లో, వార్తా పత్రికలలో యువశక్తిని వాడుకుంటామన్న రాజకీయ నాయకుల ఉపన్యాసాలు చూస్తుండేవారు. అసలు ఉద్యోగం అనేది వస్తుందా అని అనుమానం ఏర్పడింది అయిదుగురిలో.

ఒకరోజు రాజా స్వీట్స్ ప్యాకెట్‌తో వచ్చాడు. "నా పాస్‌పోర్ట్, వీసా అన్నీ రెడీ అయిపోయాయి. మా బాబయ్య అమెరికా నుంచి టికెట్టు పంపించాడు. ఎంత ప్రయత్నించినా దేశసేవ చేసేభాగ్యం లేకపోయింది. ఆ పుణ్యం మీకే దక్కుతుందేమో."

"అక్కడ ఉద్యోగం దొరికిందా"

"లేదు. వెళ్లి ప్రయత్నం చేయాలి. ఏముందక్కడ పెట్రోలు బంకులో పనిచేసినా ఇక్కడకన్నా ఎక్కువే వస్తుంది".

❖ ❖ ❖

ఓ రోజు సాయంత్రం చందర్ అప్లికేషన్ ఫారం నింపుతుంటే స్వామి అడిగాడు- "ఏమిటూ అప్లికేషన్? నాకూ తెలేకపోయావా?"

చందర్ ఇబ్బందిగా కదిలేడు "ఇది స్పెషల్ రిక్రూట్‌మెంట్. నీకు పనికిరాదు".

ఆరునెలలలోగానే చందర్ ప్రభుత్వోద్యోగి అయ్యేడు.

ఇంటివారమ్మాయి సరదాగా అడిగింది స్వామిని, "అదేమిటి ముందుగా మీకు ఉద్యోగం వస్తుంది, మీరే వెళ్లిపోతారనుకున్నాను" అని

స్వామి కూడా సరదాగా అన్నాడు "ఓడ మునిగిపోయేటప్పుడు కెప్టెను చివరిదాకా ఉంటాడని ఇంగ్లీషు సామెత వినలేదా?"

రోజులు గడుస్తున్నాయి. విజయ్‌కి బి.హెచ్. అనే ప్రైవేట్ కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. "అదేమిటి ఈ కంపెనీకి నువ్వు అప్లైచేశావా? మాకు తెలీదే" అన్నాడు రఘు.

"నేను అప్లై చేయలేదు. మా అంకుల్ ఎలక్ట్రిసిటీ బోర్డులో చీఫ్ ఇంజనీర్. ఆయన వేయించారు."

"మీ అంకుల్స్ ఎవరూ ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉన్నారని ఎప్పుడూ చెప్పలేదే"

"పాతిక వేల రూపాయలు నన్నాయన మేనల్లుణ్ణి చేశాయి. లక్షవుంటే అల్లుణ్ణిచేసి గవర్నమెంటులోనే వేయించి ఉండును."

"ఇంక ఉద్యోగాలు లాభంలేదు. నేను స్వయం ఉపాధిపథకం ప్రయత్నిస్తాన"న్నాడు రఘు.

బ్యాంకు మేనేజరు చేతిలోకి, రెవిన్యూ ఆఫీసర్ల చేతిలోకి సంబంధిత అధికార్లు అందరిచేతుల్లోకి వెళ్లాల్సిన పైకం వెళ్లింది. కాగితాలన్నీ చక్కగా కదిలిపోయాయి. రఘు చిన్న వర్క్‌షాపు ప్రారంభించేడు. "నువ్వు కూడా ఈ ప్రయత్నమే చేయరాదా" అన్నాడు స్వామిని "డబ్బుండాలిగా" అన్నాడు స్వామి.

ఆ రాత్రి గది ఖాళీగా అనిపించింది. మిత్రులు నలుగురూ వెళ్లిపోయేరు. డబ్బు, పలుకుబడి, దనవంతులైన బంధువులూ, కులం ఏంలేని తను మిగిలిపోయాడు. భవిష్యత్తు అంధకారంగా ఉంది. బతికి ఏం సాధించాలి? మెరిట్ వల్ల ఏపనీ కాదు.

బట్టలారేసుకొనే చేంతాడు గదిలోని కొక్కేనికి కట్టాడు.

అవినీతిఅనే చిల్లుపడి, నాయకుల పదవీకాంక్ష అనే ఝుంఝూ మారుతంలో చిక్కుకుని దేశప్రగతి అనే పడవ మునిగి పోయింది సరంగుతో సహా.

(ఆంధ్రజ్యోతి వీక్లీ)